క్లుప్తంగా

విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలి



దాచేపల్లి: రజకులు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని కో ఆప్షన్ సభ్యుడు, రంజక సంఘం నేత శెట్టిపల్లి పూర్ణ అన్నారు. నారాయణపురం ఆర్అండ్బీ బంగ్లాలో రజక సంఘం నేతల సమావేశం ఆదివారం నిర్వహించారు. రజకుల అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. పూర్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రజకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుల వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న రజకులకు ప్రభుత్వం అండగా ఉందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన అవకాశాలతో పిల్లలను చక్కగా చదివించి ఉన్నతమైన స్థానాల్లో ఉంచాలని, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి త్వరలో కలసి రజకుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గరికపాటి సైదారావు, బి.సీతారామయ్య, జి.వెంకట్‌కుమార్, పి.శంకరరావు, జి.కోటేశ్వరరావు, పి.అంజి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల తిరునాళ్ల సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు ప్రారంభించారు. పోటీలలో 40 టీమ్‌లు పేర్లు నమోదు చేసుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రాయపాటి మాణిక్యం పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, సేవాసమితి సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్.అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, బి.శివ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి చర్యలు

విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు విద్యార్థులకు భోజనశాల నిర్మించటానికి అంచనాలు రూపొందిస్తున్నట్లు ఆ ప్రాజెక్టు డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబు తెలిపారు. ఆదివారం పాఠశాలను సందర్శించారు. ఇటీవల ప్రాజెక్టు వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ ఎస్కే చాంద్‌బాషా పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయటానికి పడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా భోజనశాల నిర్మిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట విజయపురిసౌత్ బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ కోట్ల కోటేశ్వరావు ఉన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

మాచర్ల: వృద్ధులకు తమ వంతు సహాయం అందిస్తున్నట్లు పవర్ ఫౌండేషన్ అధ్యక్షులు, న్యాయవాది జి.జయానందరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పూర్ణయ్య షెడ్డు ప్రాంతంలో నివాసముంటున్న కొనియాల కృష్ణాంజనేయాచారి ఆయన సతీమణి ఇరువురు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సభ్యులు వారిని కలిసి రూ.5 వేలు విలువైన 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు, నగదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ జి.అప్పారావుచారి, కడియం అన్నారావు, రత్నారావు, రంగానాయక్ పాల్గొన్నారు.

నేడు పెన్షన్‌ల పంపిణీ

దుర్గి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు.

రాహు కేతువులకు విశేషపూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు- కేతుపూజలు ఘనంగా నిర్వహించారు. రాహు కేతులకు పూజలు చేసేందుకు ఆదివారం అనువైన రోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు.

బీసీలకు అండగా సీఎం జగన్

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- ముదిరాజుల కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత సామాజిక సాధికార కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో ముదిరాజ్ కల్యాణ మండప నూతన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు కేటాయించి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ నిర్దేశించిన విధానంలో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అన్నీ సామాజిక వర్గానికి సమ ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ భూముల్లో స్థలాలు కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ముదిరాజులకు 15సెంట్లలో కళ్యాణ మండపం, కమ్యూనిటీ హాలు రూ.20లక్షలు కేటాయించామన్నారు. శంకుస్థాపన చేసి నిధులు కేటాయించిన కమ్యూనిటీ హాలు వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే పర్యటనలో ముదిరాజులు భారీ స్థాయిలో హాజరై ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముదిరాజు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కొర్నె నారాయణ, డైరెక్టర్ ఎలుగు మద్దిలేటి స్వామి, కౌన్సిలర్ తాళ్ల గోవర్ధిని కొండలు, రాష్ట్ర కార్యదర్శి వల్లెబోయిన రాజు, జిల్లా అధ్యక్షుడు గౌడుగు శంకర్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు కోలా ఏడుకొండలు, రాజేంద్ర ప్రసాద్, జి.శ్రీనివాసరావు, కె.రమణ, ఆర్.సాయి, కె.ఆంజనేయులు, రాష్ట్ర కోశాధికారి బి.పాపారావు, కె.సీతయ్య, సీతారామయ్య, ఆరె చెన్నయ్య, బి.నరసింహారావు, బి.చంద్రం, గురుప్రసాద్, తరిపి శ్రీను, బొజ్జా అంజిబాబు, బైరి రామారావు, ఎం.వెంకయ్య, టి.అంబారావు, ఎం.గోపయ్య, టి.శ్రీనివాసరావు, శ్రీను, నక్కా శ్రీను పాల్గొన్నారు.

లూథరన్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తా



రెంటచింతల లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: పురాతనమైన ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చర్చిలో దైవసేవకులు కటికల యేసుదానం నేతృత్వంలో ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిథిలావస్థకు చేరిన చర్చి మరమ్మతుల నిమిత్తం చేయూతనివ్వాలని అడిగిన వెంటనే స్పందించిన రామకృష్ణారెడ్డికి దేవుని ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని పాస్టర్ యేసుదానం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ఎంతో విశిష్టత కలిగిన ఈ చర్చి అభివృద్ధికి తాను కృషి చేయడం జీసస్ కృపగా భావిస్తానన్నారు. దైవ కుమారుడైన ప్రభువైన ఏసుక్రీస్తు అడుగుజాడలలో నడవాలన్నారు. ఇప్పటికే ఇంజినీర్లను పిలిపించి అంచనా వేయించినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 నాటికి అభివృద్ధి పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్త ఉమ, చర్చి డెలికేట్లు డేగల సంసోన్, డేగల సామేల్, చర్చి పెద్దలు, పార్టీ నాయకులు మర్రి ఫిలోమెన్‌రాజు, రాజు, రత్నం పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీతో అవ్వాతాతల్లో ఆనందం



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి



గామాలపాడులో పింఛన్ నగదు అందజేస్తున్న దృశ్యం

పిడుగురాళ్లరూరల్: పింఛన్ పంపిణీతో అవ్వాతాతల మోములో ఆనందం కనిపిస్తుందని ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని చెన్నాయిపాలెం, వీరాపురం గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షులు గార్లపాటి వెంకటేశ్వర్లు, సర్పంచులు గండికోట రమాదేవి, సుకంర విజయరామారావు, మాజీ ఎంపీపీ గండికోట రామకోటేశ్వరరావు, జిల్లా యువజన విభాగ కార్యదర్శి జంగ మ్మయ్య, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ అచ్చయ్య, ఎంపీటీసీలు పుల్లా జ్యోతి రమేష్, తిమ్మరాజు రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గామాలపాడులో పింఛన్ పంపిణీ

దాచేపల్లి: పెన్షనర్లకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. నగర పంచాయతీతో పాటుగా మండల వ్యాప్తంగా కొత్త పింఛన్ల పంపిణీ సంబరాలు ఆదివారం జరిగాయి. గామాలపాడులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ హాజరయ్యారు. నగర పంచాయతీ చైర్మన్ సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జాను, అబ్దుల్‌సత్తార్, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, సొసైటీ చైర్మన్ బత్తుల లింగారెడ్డి, సర్పంచులు కె.నాగిరెడ్డి, జె.సురేష్, వి.కోటేశ్వరరావు, కె.వెంకటకోటయ్య, వెంకటచారి, కాశయ్య, ఇమామ్‌వలి పాల్గొన్నారు.



శంకర్‌కు పెన్షన్ నగదును అందజేస్తున్న 10వ వార్డు కౌన్సిలర్ షేక్ అబ్దుల్లా

అర్హతే ప్రామాణికం..

పిడుగురాళ్ల: అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ముందుకు సాగుతోందని 10వ వార్డు కౌన్సిలర్ షేక్ అబ్దుల్లా తెలిపారు. నూతనంగా మంజూరైన పింఛన్లు ఆదివారం పంపిణీ చేశారు. టీడీపీకి చెందిన పులికూరి శంకర్‌కు పింఛన్ మంజూరు కావడంతో అందజేశారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- ముగిసిన గ్రామ, వార్డు స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు
- నేటి నుంచి మండల స్థాయి ముగ్గుల పోటీలు



పట్టణంలోని 31వ వార్డులో ముగ్గుల పోటీల్లో మహిళలు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇళ్ల ముందు కూడా రంగురంగుల ముగ్గులు ఆకట్టుకుంటున్నాయి. తమ సృజన నైపుణ్యాలను ప్రదర్శిస్తూ రంగురంగుల ముగ్గులు వేస్తున్నారు.

ఇంటి ముంగిట కళకళలాడే ముగ్గులు...

సాధారణంగా ధనుర్మాసం నుంచి ఇళ్ల ముందు ముగ్గులు కళకళలాడుతాయి. సంక్రాంతి వరకు ఇళ్ల లోగిళ్లలో ముగ్గులు తీర్చిదిద్దుతారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో మహిళల ప్రోత్సహించటం కోసం ప్రత్యేకంగా వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు 2018 నుంచి సంప్రదాయంగా నిర్వహిస్తూ నగదు బహుమతులను అందజేస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈ నెల 3 నుంచి 6 వరకు చేపట్టిన గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు స్థాయి ముగ్గుల పోటీలు ముగిశాయి. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన, బీమవరం, నకరికల్లు మండలం జిల్లా పేట తండా, పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం నిర్వహించటంతో గ్రామ/వార్డు స్థాయి పోటీలు ముగిశాయి. గ్రామ/వార్డు స్థాయిలో విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు పంపిణీ చేయనున్నారు.

పది వరకు మండలస్థాయిలో..

సోమవారం నుంచి మండల/మున్సిపాలిటీ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ నెల 8న నకరికల్లు, 9న ఉదయం ముప్పాళ్ళ, సాయంత్రం రాజుపాలెం, 10న ఉదయం సత్తెనపల్లి టౌన్, సాయంత్రం సత్తెనపల్లి రూరల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లోని 25 మంది విజేతలకు ఈనెల 12న సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.2 లక్షలు, ద్వితీయస్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు, నాలుగో స్థానానికి రూ.25 వేలు, ఐదో స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందించనున్నారు.

12,916 మంది మహిళలు భాగస్వాములు..

వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కాగా గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు స్థాయిలో 12,916 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారు. ఈ ఏడాది మరింత రెట్టింపు ఉత్సాహంతో మహిళలు పోటీల్లో పాల్గొనడం విశేషం. అత్యధికంగా సత్తెనపల్లి రూరల్ మండలంలో 3,793 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారు.

రేపు ప్రభుత్వ విప్ పీఆర్కే పర్యటన

కారెంపూడి: నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ, అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం కారెంపూడి మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం ఒప్పిచర్ల గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. చింతపల్లిలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభిస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మాచర్ల: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ దేవాలయ సమీపంలో మృతి చెందిన ఓ అనాథ వ్యక్తి మృతి చెందగా పట్టణంలోని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి, పోలీసుల ఆధ్వర్యంలో మృతదేహాన్ని తరలించి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. అర్బన్ సీఐ పి.శరత్‌బాబు సమాచారం మేరకు శవాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు తెలిపారు.

సరిహద్దుల్లో నిఘా పటిష్టం

దాచేపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు గురజాల డీఎస్పీ పల్లపు రాజు అన్నారు. మండలంలోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నగదు తరలించకుండా వాహనాల తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. నిరంతరం వాహనాల రాకపోకలపై నిఘా పెట్టామని చెప్పారు. నగదు తరలిస్తే తప్పనిసరిగా అందుకు సంబంధించిన సరియైన పత్రాలు ఉండాలని, లేకుంటే సీజ్ చేస్తామని కోరారు. తనిఖీల్లో సీఐ సురేంద్రబాబు, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, సంధ్యారాణి పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

మాచర్ల రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుమందు తాగి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి రాయవరం గ్రామ జంక్షన్ పొలాలలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గురజాల మండలం, చర్లగుడిపాడు గ్రామానికి చెందిన చెప్పాల నాగేశ్వరరావు(33) గత రెండు సంవత్సరాల నుంచి దుర్గి మండలం, ఆత్మకూరు గ్రామంలో ఉంటున్నాడు. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవలకు దిగుతూ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిపోయి రాయవరం గ్రామ సమీపంలో పంట పొలాల్లో పురుగుమందు తాగి మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు

పూజల్లో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు



మంత్రి అంబటికి స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర స్వామిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు. శ్రీవారి సేవా సమాజం ఆధ్వర్యంలో మంత్రి అంబటి రాంబాబుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కండువాను కప్పి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా వివిధ రూపాలతో కూడిన కళాకారులతో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లోని దేవాలయం వద్ద నుంచి పురవీధుల్లో కనకతప్పట్లు, మేళతాళాలతో గ్రామోత్సవం వైభవంగా సాగింది.

యోగాతో ఒత్తిడి నియంత్రణ



యోగా ఆసనాలు వేస్తున్న యోగా గురువు ముత్తినేని శ్రీనివాసరావు

సత్తెనపల్లి: మానసిక, శారీరక ఒత్తిడికి యోగానే దివ్య ఔషధం అని యోగా గురువు, ఉపాధ్యాయుడు ముత్తినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉచిత యోగ శిక్షణ కేంద్రం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషి జీవితం యాంత్రిక మయమైందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవనం ఉరుకులు పరుగుల మధ్య సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ వృత్తి, వ్యక్తిగత ఒత్తిళ్లు అధికమయ్యాయని చెప్పారు. కాలుష్యం వల్ల అనేక రుగ్మతులతో బాధపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ కాస్త ఉపశమనం పొందాలంటే యోగానే సరైన సాధన అన్నారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఈ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రజలకు చేరువ చేయనున్నాయన్నారు. యోగ ఆరోగ్యానికి దివ్య ఔషధంగా ఉంటుందని, ఒత్తిడి దూరం అవుతుందన్నారు. ఎలాంటి సమస్యకైనా చక్కటి పరిష్కారం చూపించే యోగాను ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. యోగాతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్పీ ప్రసాదరాజు, మాతంగి సాంబశివరావు, కేబీఆర్‌జే ప్రసాద్, బెల్లంకొండ రమేష్, గౌస్, ఆవుల సురేష్, గరీబుల్, హనుమాన్ నాయక్, రాహుల్ గౌతమ్, భావనారుషి, ధారా జాషువా పాల్గొన్నారు.

బాల్య స్నేహ పరిమళం



గురువును ఘనంగా సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

యడ్లపాడు: యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలలో దశాబ్ద కాలం క్రితం పదో తరగతి చదివిన స్నేహితులు ఒక్కటయ్యారు. 2013-14 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ బత్తుల దుర్గారావు, మారెళ్ల జగదీష్, గుంటకల ప్రసాద్, ఇస్కేపల్లి గాయత్రి, మహేంద్ర వర్మ నేతృత్వంలో.. ఆత్మీయతతో కూడిన పలకరింపులతో గత మధురస్మృతులను నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాలలో ఆడుతూ పాడుతూ రోజంతా ఆనందంగా గడిపారు. అప్పటి తమ గురువులు బి.సునీత, ఎస్‌బీ చంద్రకళ, షేక్ షావలి, షేక్ జానీ బాషా, పుల్లగూర సుధీర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు షేక్ షావలి మాట్లాడుతూ జన్మభూమికి, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభ్యున్నతికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించి, ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, గురువుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

చిలకలూరిపేట: సామాజిక సేవతో ఎంతో సంతృప్తి లభిస్తుందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ అన్నారు. ఒయాసిస్ స్వచ్ఛంద సంస్థ 17వ వార్షికోత్సవం పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ సభ్యులే తమ సొంత నిధులు వెచ్చించి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద మహిళలకు రూ.3లక్షలతో 15 కుట్టు మిషీన్లు, నలుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, 18 మంది పేద విద్యార్థులకు రూ. 1.10 లక్షలు స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కరణం విజయలక్ష్మి, ఎండీ కరిమా, కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, జాష్టి ప్రమీలా, సీహెచ్ నిర్మల పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న డీటీ లక్ష్మీప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్

ఇరుకుపాలెం(ముప్పాళ్ల): మండలంలోని ఇరుకుపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం డీటీ లక్ష్మీప్రసాద్ ఆదివారం నిర్వహించారు. ఓటర్లు ఈవీఎం మిషన్‌లో ఏ గుర్తుపై వేశారో వీవీ ప్యాట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. పోలింగ్ సిబ్బంది సమక్షంలోనే ఓటు వేయాలని, ఒక్కరు ఒకసారి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇస్తేమాకు తరలిన ముస్లింలు

క్రోసూరు: తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లాలోని పరిగి మండలంలో జరుగుతున్న ముస్లిం మతబోధనల కార్యక్రమానికి(ఇస్తేమా) క్రోసూరు నుంచి శనివారం రాత్రి తరలివెళ్లారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏర్పాటు చేసిన బస్సుల్లో ముస్లిం తరలి వెళ్లారు. వచ్చే మంగళవారంతో ఇస్తేమా ముగుస్తుందని మత పెద్దలు తెలిపారు.

శనగలో తుప్పు తెగులును నివారించుకోవాలి

మాదల(ముప్పాళ్ల): శనగ పంటలో తుప్పు తెగులు ఆశిస్తుందని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని డాట్‌సెంటర్ నరసరావుపేట శాస్త్రవేత్తలు సీహెచ్ వరప్రసాదరావు, రమేష్ సూచించారు. మండలంలోని మాదల గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో శనగ, మిరప పంటలపై సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభ పరీక్ష



మొమెంటోలు, ప్రశంస పత్రాలతో విద్యార్థులు

శావల్యాపురం: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షను సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ, గంగినేని ఫౌండేషన్ ప్రతినిధులు సంయుక్తంగా నిర్వహించారు. గంగినేని రాఘవ మాట్లాడుతూ ఇలాంటి ప్రతిభ పరీక్షల్లో పాల్గొంటే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో భయాందోళనలు చెందకుండా ఉంటారని పేర్కొన్నారు. వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మర్రి యశోదర్, పొత్తూరి భువనసాయి సుభాష్, మానం హేమంత్ మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కన్సోలేషన్ బహుమతులను శావల్యాపురం హైస్కూలు విద్యార్థి డి.వీరచందు, పోట్లూరు పాఠశాల విద్యార్థి జి.రాధేశ్వర్ పొందారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చందు, అజిత్‌చందు, ఉపాధ్యాయులు గురుబాబు, శ్రీనివాసరాజు, వసంతరావు, శ్రీనివాసరావు, రాగుల రాధాకృష్ణమూర్తి, లోమడ చెన్నబాబు, శ్రీనివాససింగ్ పాల్గొన్నారు. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 173 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

ముప్పాళ్లలో ఉచిత వైద్య శిబిరం

ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్లలోని ఆర్ఎంపీ శ్రీనివాసమూర్తి ఆస్పత్రిలో నరసరావుపేటకు చెందిన నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆస్పత్రి నిర్వాహకులు, వైద్యులు నెల్లూరి రమేష్ పాల్గొని 180 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ప్రతి ఒక్కరికీ మొక్కను అందించారు.

